గురువారం । తెలంగాణ
21 మే 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

బదిలీలలు

ఐటీడీఏ భద్రాచలం అధికారుల వింత పోకడ..!!

- 'ఫోకల్ - నాన్ ఫోకల్' రూల్స్‌లో ఇష్టారాజ్యం..?
- నిబంధనలు మార్చి కొందరికి మేలు చేస్తున్నారంటూ విమర్శలు
- సిటీల్లో వసతులు కల్పించేందుకు నిబంధనలకే ఎసరు..?
- గిరిజన సంక్షేమ శాఖలో హెచ్‌డబ్ల్యూవోల గుస్సా!
- పీఓ, డీడీ, ఏటీడీఓల తీరుపై ఆరోపణలు..

భద్రాచలం, మే 20 (నినాదం):

కొందరికి మేలు చేయాలన్న ఉద్దేశంతో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖలో సంక్షేమ వసతి గృహ అధికారుల (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్) బదిలీల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వం జారీ చేసిన స్పష్టమైన జీఓలను బుట్టదాఖలు చేస్తూ, స్థానికంగా ఉన్న కొందరు ఉన్నతాధికారులు నిబంధనలను తమకు నచ్చినట్లు వక్రీకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీడీఏ పరిధిలో పారదర్శకతను పూర్తిగా పక్కనబెట్టి, తెరవెనుక చక్రం తిప్పుతూ అర్హులైన ఉద్యోగుల పొట్టకొడుతున్నారనే ఆరోపణలు గిరిజన సంక్షేమ శాఖ ప్రతిష్టను మసకబారుస్తున్నాయి. గతంలో ఫోకల్ పాయింట్‌గా ఉన్న ఓ ప్రసిద్ధ ప్రాంతాన్ని ప్రస్తుతం నాన్ ఫోకల్ పాయింట్‌గా చూపిస్తూ అక్కడ పనిచేస్తున్న సంక్షేమ అధికారులను తిగిరి ఫోకల్ పాయింట్‌లోనే విధులు నిర్వర్తించేలా ఐటిడిఏలోని కీలక అధికారులు పావులు కదుపుతున్నారని పలువురు ఉద్యోగస్తులు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నారు. కాగా ఈ బదిలీల వ్యవహారం పారదర్శకంగా జరగాల్సి ఉండగా, కొందరు అధికారులు పైరవీలతో పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో ఫోకల్.. ఇప్పుడు ఎలా 'నాన్-ఫోకల్'..?

అధికారుల పక్షపాత వైఖరికి, నిబంధనల ఉల్లంఘనకు ఒక నిలువెత్తు సాక్ష్యంగా కొత్తగూడెం కార్పొరేషన్‌కు ఆనుకోని ఉన్న చుంచుపల్లి ప్రాంతం, భద్రాచలం పట్టణం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అన్ని రకాల రవాణా, విద్యా, వైద్య సౌకర్యాలు ఉండి, ఐటీడీఏ ప్రధాన కేంద్రంగా ఉన్న భద్రాచలం పట్టణంతో పాటు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆనుకోని ఉన్న చుంచుపల్లి మండల పరిధిలోని వసతి గృహాలను గత బదిలీల్లో 'ఫోకల్ పాయింట్'గా పరిగణించారు. విచిత్రంగా, ఈసారి బదిలీలకు వచ్చేసరికి ఏకంగా ఈ రెండు ప్రాంతాలను పంచాయతీల పేరుతో 'నాన్-ఫోకల్' జాబితాలోకి మార్చేశారు. సకల సౌకర్యాలు ఉన్న జిల్లాలోనే అత్యంత కీలకమైన భద్రాచలం పట్టణం 'నాన్-ఫోకల్' ఎలా అయిపోతుంది? కొత్తగూడెం కార్పొరేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న చుంచుపల్లి ప్రాంతం ఎలా మారుస్తారు ? దీని వెనుక ఉన్న మతలబు ఏంటి? రూల్స్ ప్రకారం లూప్ లైన్ (దూర ప్రాంతాల)లోకి వెళ్లాల్సిన కొందరు 'సెలెక్టెడ్' ఉద్యోగులను పట్టణంలోనే ఉంచేందుకు, అధికారులే ఈ నిబంధనను సృష్టించారనే అనుమానాలు క్షేత్రస్థాయిలో బలంగా వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు బేఖాతర్!

ప్రభుత్వం తెచ్చిన విధానం ప్రకారం "ఫోకల్ నుండి నాన్-ఫోకల్.. నాన్-ఫోకల్ నుండి ఫోకల్" స్థానాలకు బదిలీలు జరగాలి. తద్వారా అందరు ఉద్యోగులకూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే సమాన అవకాశం లభిస్తుంది. కానీ, ఇక్కడ సీనియారిటీని, స్టేషన్ సర్వీస్ కాలాన్ని, స్థానిక హక్కులను పూర్తిగా తొక్కిపెట్టారు. పీఓ, డీడీ, ఏటీడీఓల స్థాయిలోనే ఇలాంటి అక్రమాలకు తెరలేపార్న విమర్శల నేపథ్యంలో ఉద్యోగులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. ఐటీడీఏ పరిపాలనా వ్యవస్థపై నమ్మకం దెబ్బతినక ముందే.. ప్రాజెక్టు అధికారి ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకొని నిష్పక్షపాత విచారణ జరపాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 'ఫోకల్', 'నాన్-ఫోకల్' పోస్టులపై స్థానిక అధికారుల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేస్తూ తక్షణమే స్పష్టమైన గైడ్‌లైన్స్ విడుదల చేయాలని, కొందరికి మేలు చేసేలా రూల్స్ మార్చి ఇప్పటికే జరిపిన బదిలీలు, డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేసి, పునఃసమీక్షించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. సీనియారిటీ ఆధారంగానే పారదర్శకంగా బదిలీలు జరపాలని, ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించి, నిబంధనలను వక్రీకరించిన అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, గిరిజన విద్యార్థుల భవిష్యత్తు నాశనం కాకుండా ఉండాలన్నా, శాఖలో జవాబుదారీతనం పెరగాలన్నా ఈ బదిలీల అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ అత్యవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎంపీని కలిసిన వివిధ గ్రామాల సర్పంచ్లు.

కొల్చారం మే 20 (నినాదం)

గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచులే కీలక పాత్ర గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అప్పాజీపల్లి సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్, పోతంశెట్టిపల్లి సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి అభ్యర్థించారు. సిసి రోడ్లు పంచాయతీ భవనం అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మెమరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల రాజా గౌడ్ నెల్లి నవీన్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

- ఔషధ రంగంపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని అడ్డుకుందాం
- మందుల షాపుల యజమానుల న్యాయమైన పోరాటానికి పూర్తి మద్దతు
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

కొత్తగూడెం, మే 20(నినాదం):

ఫార్మసీ రక్షణ కోసం, ప్రజా ఆరోగ్యం పరిరక్షణ కోసం దేశవ్యాపితంగా చేపట్టిన మెడికల్ షాపుల బందులో భాగంగా కొత్తగూడెం కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గణేష్ టెంపుల్ ఏరియాలో నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నిరసన శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సందర్శించి, బంద్‌కు తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్లే నేడు మెడికల్ షాపుల యజమానులు రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల స్థానిక వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, నకిలీ మందుల సరఫరా పెరిగి ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ఉన్న చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఫార్మసీ రంగాన్ని, చిన్న వ్యాపారులను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా సాగుతున్న ఈ పోరాటం ఎంతో న్యాయమైనదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మెడికల్ అసోసియేషన్ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని డిమాండ్ చేశారు.

డిజిటల్ సభ్యత్వ నమోదు ద్వారా పార్టీని గ్రామ స్థాయి నుంచి

మరింత బలోపేతం చేయాలి..

- కార్యకర్తలే పార్టీకి వెన్నెముక -- అంకితభావంతో పనిచేసిన వారికే భవిష్యత్తులో ప్రాధాన్యత..
- ఖమ్మం జిల్లా వేదికగా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం అవుతుంది.
- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ, జిల్లా ఇన్చార్జి రవీంద్ర, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ నామ

ఖమ్మం, మే 20(నినాదం):

ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, తెలంగాణ భవన్‌లో ఖమ్మం, ఇల్లందు, మధిర, వైరా నియోజకవర్గాలకు సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. బి ఆర్ ఎస్ పార్టీ చేపట్టబోయే డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ విస్తరణ, కార్యకర్తల భాగస్వామ్యం, జిల్లా రాజకీయ పరిస్థితులపై విస్తృత చర్చ జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా ఇంచార్జ్ తక్కినపల్లి రవీందర్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు , మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తొలిసారిగా అత్యాధునిక డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతుండడం పార్టీ ఆలోచనా విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ నిజమైన పార్టీ అభిమానులు, అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు సభ్యత్వం అందేలా పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త "పార్టీ సభ్యత్వమే లక్ష్యం - పార్టీ విజయమే ధ్యేయం" అనే నినాదంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు భవిష్యత్తులో తగిన గుర్తింపు, సముచిత అవకాశాలు తప్పకుండా లభిస్తాయని స్పష్టం చేశారు. గ్రూపు రాజకీయాలకు ఏమాత్రం తావు లేకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ నాయకత్వం సమిష్టి భావనతో పనిచేస్తుందని, వ్యక్తిగత స్వార్థాల కంటే పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన నాయకులు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భట్టి విక్రమార్క లు ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించి కేవలం కమిషన్లు, ప్రభుత్వ భూముల దోపిడీ రాజకీయాలకే పరిమితమయ్యారని విమర్శించారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం ఇప్పటివరకు "తట్టెడు మట్టి కూడా పోసిన దాఖలాలు లేవని" తీవ్రస్థాయిలో ఎద్దేవా చేశారు. నిరుపేదల గుడిసెలను కూలగొట్టి పేదల కన్నీళ్లు కార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా భూదాన్ బాధితుల విషయంలో అధికార పార్టీ అహంకార ధోరణితో వ్యవహరించిన సమయంలో మాజీ మంత్రి లిపువ్వాడ అజయ్ కుమార్ గారిలి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడి బాధితులకు మళ్లీ అక్కడే ఇంటి స్థలాలు లభించే వరకు పోరాటం కొనసాగించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని గుర్తు చేశారు.తెలంగాణ ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడాలని పార్టీ అధ్యక్షుడు లికల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం జిల్లా వేదికగా ఉద్యమాలు, పోరాటాలు మరింత ఉధృతం అవుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే బీఆర్ఎస్ ముఖ్య నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, అరెస్టుల పర్వాన్ని కొనసాగిస్తోందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణగదొక్కడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి లికల్వకుంట్ల చంద్రశేఖర రావు గారిలి నాయకత్వం శ్రీరామరక్షలా మారిందని, గత బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచివున్నాయని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ నిధులు కేటాయించి అనేక ప్రాజెక్టులను పూర్తి చేసిందని, ప్రస్తుతం కొనసాగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైనవేనని గుర్తు చేశారు. జిల్లా ప్రజల శాశ్వత సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపుదిద్దుకున్న సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ గారి దూరదృష్టికి నిదర్శనమని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లా చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఆ ప్రాజెక్టులను నత్తనడకన ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ హరి సింగ్, ఖమ్మం నగర మాజీ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్‌జేసీ కృష్ణ, బానోతు మంజుల, గిరిబాబు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమ్మర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారాన్ని మోపి నడ్డి విరుస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్

- ఎన్నికలు ముగియగానే బాదుడా???
- పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలి
- సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

పాల్వంచ, మే 20(నినాదం):

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు విమర్శించారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పెట్రోల్ డీజిల్ పై విపరీతంగా ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రతి ఎన్నికల సందర్భంగా మేము పెట్రోల్ డీజిల్ పై ఎటువంటి ధరలు పెంచమని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తూ ఎన్నికలు అయిపోయిన వెంటనే నిస్సిగ్గుగా రేట్లు పెంచుతూ దేశ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినాయి కాబట్టి ఇక్కడ కూడా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచుతున్నామని మాట్లాడుతున్న బిజెపి కేంద్ర సర్కార్ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ తగ్గినప్పుడు ఎందుకు ఇక్కడ ధరలు తగ్గించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వంట గ్యాస్ ధర పెంపుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్న చిన్న టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్లు మూతపడి ఉపాధి లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఇప్పుడు చమురు ధరలు పెంచడం వల్ల రవాణా రంగంపై పెనుభారం పడనుందని, నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రమను నమ్ముకుని బతుకుతున్న ప్రజల అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది ప్రజలు కనీస వేతనం పొందలేని పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలు ఉన్నాయిని, ధరల పెరగటం మూలంగా వారి రోజువారి జీవితాన్ని ప్రమాదంలోకి నెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలు మరింతగా పెంచి ఆయిల్ కంపెనీలకు దోచిపెట్టడానికి ఈ దేశపాలకవర్గం సిద్ధంగా ఉన్నదిని, ప్రజా వ్యతిరేక విధానాలుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలే మాత్రమే ప్రజలను రక్షిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్ జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వీ పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు నరహరి నాగేశ్వరరావు, షేక్ రెహమాన్ బాబా గౌస్, హైమద్ జానీ, కరీం, నామ పండు, కాకటి రవీందర్, ప్రేమచంద్, రామాచారి, కృష్ణ, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, లక్ష్మీ, విజయ, పద్మ, హెచ్ వెంకటేశ్వర్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు చేదన - నిందితుడు అరెస్ట్

మధిర, మే 20 (నినాదం):

మధిర రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం గ్రామం నక్షత్ర ఓపెన్ వెంచర్ ప్రాంతంలో 15-05-2026 వ తేదీన జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు వివరాల ప్రకారం 16-05-2026 వ తేదీ ఉదయం 04:00 గంటలకు గోపిశెట్టి సాయిరాంఏసాయి, తన అక్క గోపిశెట్టి కల్పన (28), నివాసం మేడూరు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా, కనిపించడం లేదని కల్పన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఉద్యోగం చేస్తూ ప్రతిరోజు మేడూరు నుండి మధిరకు విధులకు వెళ్ళేది.15 -05-2026 ఉదయం విధులకు వెళుతున్నానని ఇంటి నుండి బయలుదేరిన ఆమె ఆరోజు కార్యాలయానికి హాజరు కాలేదని సహోదయోగి ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అదేరోజు యార్లగడ్డ చెన్నారావు అనే వ్యక్తి మీ అక్క నా దగ్గర ఉంది, మాట్లాడుకోవాలి అంటూ ఫోన్ సందేశం పంపినట్లు ఫిర్యాదు దారు తెలిపారు. అనంతరం సెల్ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చేపట్టగా కృష్ణాపురం గ్రామ శివారులోని నక్షత్ర ఓపెన్ వెంచర్ ప్రాంతంలో కల్పన మృతదేహం లభ్యమైంది. ఆమె మెడ మరియు నోటి చుట్టూ, చున్ని బిగించి హత్య చేసినట్లు గుర్తించారు. ఇట్టి విషయంపై మధిర రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినారు. ఫిర్యాదు ఆధారంగా మధిర రూరల్ పిఎస్ నందు క్రైమ్ నెంబర్ 58/2026ఖ/ం 103(1)దీచీూ క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సాక్షులను విచారించగా, నిందితుడు యార్లగడ్డ అంకుశరావుఏచెన్నారావు (30), కనుమూరు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా వాసి, మృతురాలితో సన్నిహిత సంబంధం కొనసాగించినట్లు వెల్లడైంది. వ్యక్తిగత సంబంధాల విషయంలో ఇద్దరి మధ్య తరచు వివాదాలు జరుగుతున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు అనంతరం నిందితుడి కోసం (3) ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. 15-05-2026 న నిందితుడు మృతురాలిని తన ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం సమీపంలోని ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదంలో, త న సంబంధం గురించి తన భార్యకు చెబుతానని మృతురాలు హెచ్చరించడంతో, కోపోద్రిక్తుడైన నిందితుడు చున్నీతో ఆమె మెడ బిగించి హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. 20-05-2026 తేదీన అంబారుపేట వెంచర్ ప్రాంతంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, అతని వద్దనుండి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరు పరచనున్నారు. ఈ కేసును వైరా ఏసిపి సాదుల సారంగపాణి పర్యవేక్షణలో మధిర సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. మధు, మధిర రూరల్ ఎస్సై బి. లక్ష్మీ భార్గవి మరియు సిబ్బంది సమర్థవంతంగా దర్యాప్తు చేసి కేసు ను ఛేదించారు. ప్రజలకు పోలీసుల సూచనలు:- వ్యక్తిగత సంబంధాల పేరుతో మోసపోయే పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిచయాలు, వ్యక్తిగత సంబంధాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద ప్రవర్తన గమనించిన వెంటనే కుటుంబ సభ్యులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఏకాంత ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత విషయాలపై వివాదాలు తీవ్ర రూపం దాల్చే పరిస్థితులను నివారించాలి. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, సమస్యలు తలెత్తినప్పుడు చట్టపరమైన సహాయం తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ సారంగపాణి ఏసీపీ వైరా పర్యవేక్షణలో మధిర సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. మధు మరియు మధిర రూరల్ ఎస్సై బి లక్ష్మీ భార్గవి మరియు సిబ్బంది ఈ కేసును చేయించడం జరిగింది